
సాక్షి
మెదక్
సోమవారం ; 11 ; డిసెంబర్ ; 2023



చరిత్రకు చెదలు

చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న గడికోటలు శిథిలమవుతున్నాయి. వాటి మరమ్మతులకు ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. వివరాలు 8లో ▸



నాచగిరికి పోటెత్తిన జనం

ఓ వైపు కార్తీక వ్రతాలు, మరో వైపు నిజాభిషేకాలు, కల్యాణాలతో ప్రసిద్ధ నాచగిరి పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. వివరాలు 8లో ▸



ఆటో డ్రైవర్ల నిరసన

ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశ పెట్టడం వల్ల తమ జీవనోపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్లు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఏడుపాయలలో నేడు టెండర్లు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో సోమవారం టెండర్లు నిర్వహించనున్నట్లు చైర్మన్ బాలాగౌడ్ తెలిపారు. కొబ్బరి కాయలు, తలనీలాలు, ఒడిబియ్యం, కొబ్బరి ముక్కలు, పూజా సామగ్రి, ఎంటర్‌టైన్‌మెంట్, ఎగ్జిబిషన్ తదితర హక్కులు పొందేందుకు టెండర్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొబ్బరికాయల కోసం రూ.8 లక్షలు, తలనీలాల కోసం రూ.3 లక్షలు, కొబ్బరి ముక్కల కోసం రూ.3.50 లక్షలు, పూజా సామగ్రి కోసం రూ.8 లక్షలు, ఎగ్జిబిషన్ కోసం రూ.లక్ష డిపాజిట్ చేసి టెండర్లలో పాల్గొనాలని వివరించారు.

రాష్ట్రంలో బీజేపీకి మరింత ఆదరణ

ఈటల రాజేందర్



అయ్యప్ప పూజలో పాల్గొన్న ఈటల రాజేందర్

మనోహరాబాద్(తూప్రాన్): ఈ సారి ఎన్నికలలో బీజేపీకి ప్రజలలో ఆదరణ మరింత పెరిగిందని బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ దేవాలయం వద్ద పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప గురుస్వాములు ప్రభాకర్‌గౌడ్, గోపాల్ ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక 18వ పడిపూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ఫోరం ఉపాధ్యక్షుడు నత్తి మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, బీజేపీ నాయకులు అజయ్, ఎంపీటీసీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన భద్రాద్రికి



రామాయంపేట చేరుకున్న హనుమాన్ భక్తులు

రామాయంపేట(మెదక్): నారాయణఖేడ్ నుంచి భద్రాచలం వరకు కాలినడకన వెళుతున్న హనుమాన్ స్వాములు ఆదివారం రామాయంపేట చేరుకోగా, వారికి స్థానికులు స్వాగతం పలికారు. తాము మూడు రోజుల క్రితం నారాయణ్‌ఖేడ్ నుంచి పాదయాత్ర ప్రారంభించామని వారు చెప్పారు. మరో వారం రోజుల్లో భద్రాచలం చేరుకుంటామన్నారు.

ఎస్సీ, ఎస్టీ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లేశం



పెద్ద శంకరంపేట(మెదక్): తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పెద్ద శంకరంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న పాక మల్లేశం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లేశం మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం, అలాగే బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు బరగెల నారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు రవికి కృతజ్ఞతలు తెలిపారు.

సహకరిస్తూనే సాధించుకుంటాం..

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

మెదక్ కలెక్టరేట్: తెలంగాణ నూతన ప్రభుత్వానికి సహకరిస్తూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకుంటామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి తెలిపారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రెవంత్‌రెడ్డికి తమ సంఘం తరపున శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పెండింగ్ బకాయిలు, డీఏలు విడుదల చేయాలని కోరారు. జీఓ 317, సీపీఎస్‌లను రద్దుచేసి ఓపీఎస్ విధానానం అమలు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, మెదక్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పోచయ్య, ఫైనాన్స్ సెక్రటరీ కిష్టయ్య, ప్రణీద్‌కుమార్, అశోక్, రాజు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, (ఇన్‌సెట్) ఆలయంలో కొలువైన దుర్గమ్మ

ఏడుపాయలలో భక్తుల సందడి

పాపన్నపేట(మెదక్): ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ఏడుపాయల ఆదివారం భక్తులతో కిటకిట లాడింది. ఉదయం అర్చకులు పార్థివశర్మ, శంకరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు దుర్గమ్మ తల్లిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఒడిబియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారు.





ప్రత్యేక ప్రార్థనల్లో నిమగ్నమైన భక్తులు, (ఇన్‌సెట్) సందేశం ఇస్తున్న శాంతయ్య

ప్రభువుకు ప్రత్యేక ప్రార్థనలు

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి విచ్చిన ఏసయ్య విశ్వాసకులతో సందడిగా మారింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు సార్లు ప్రభువుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశమిచ్చారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పోలీసుల్లో బదిలీల టెన్షన్

- నేతలతో అధికారుల పైరవీలు
- డిమాండ్ ఉన్న స్టేషన్లపై నజర్
- ప్రభుత్వం మారడంతో ముమ్మర ప్రయత్నాలు



మెదక్: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడంతో పోలీస్ అధికారులు బదిలీల టెన్షన్‌లో ఉన్నారు. కొందరు బదిలీల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చాలా మంది పోలీసులు పైరవీలతో వచ్చిన వారు కొందరైతే, రాజకీయనాయకులు వారికి నచ్చిన వారిని తెచ్చుపెట్టుకున్న వారు మరికొందరు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వారు తమకు అనుకూలంగా ఉండే పోలీస్‌లను తెచ్చిపెట్టుకోవడం సర్వసాధారణం.

టెన్షన్ ప్రారంభం..

అయితే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఖాకీల్లో బదిలీల టెన్షన్ ఆరంభమైంది. జిల్లాలో మెదక్, నర్సాపూర్ రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉండడంతో పోలీసులు అధికార పార్టీ కొమ్ము కాసినట్లు అప్పట్లో కాంగ్రెస్ నాయకులు బహిరంగ విమర్శలే చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్‌లో జరిగిన రోడ్‌షోలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రచారంలో పాల్గొన్న పోలీసులు కాంగ్రెస్ కార్తలను, రోడ్‌షోకు వచ్చే ప్రజలను అడ్డుకోగా ఈ విషయం రేవంత్‌రెడ్డి దృష్టికి కార్యకర్తలు తెచ్చారు. దీంతో పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసిన రేవంత్ రెడ్డి పోలీసులు తమ కార్యకర్తలు, ప్రజలను సభాస్థలికి రాకుండా అడ్డుకుంటున్నారని, వారిని వదలకుంటే తాము అధికారంలోకి రాగానే చూసుకుంటామని ఆయన హెచ్చరించారు. అన్నట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎస్ఐ నుంచి ఎస్పీ స్థాయి అధికారులు తమ బదిలీల కోసం ముమ్మరం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం మెదక్ జిల్లాలో పని చేస్తున్న పోలీస్ అధికారులలో ఎక్కువ మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సిఫారసుల ద్వారా వచ్చిన వారే. అధికారపార్టీ వారికి అనుకూలంగా ఉంటూ, ప్రతిపక్ష నాయకులపై కఠినంగా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి.

ముమ్మర ప్రయత్నాలు

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేగా గెలిచిన వారు, స్థానికంగా ఉండే నేతలు తమకు అనుకూలంగా ఉండే అధికారులను రంగంలోకి దించుకునే ప్రయత్నాలు మొదలు పెట్టకముందే బదిలీ చేయించుకోవాలని కొంత మంది పోలీసు అధికారులు ప్రయత్నాల్లో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా పనిచేసిన పోలీస్ అధికారులు, అలాగే ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపణలను ఎదుర్కొంటున్న వారు తమ బదిలీల కోసం టెన్షన్‌లో ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఎలాగూ మరో చోటికి వెళ్లక తప్పదని భావిస్తున్న పోలీస్ అధికారులు ఇక్కడి నుంచి ఎంత తొందరగా వెళ్ళిపోతే అంత మంచిదన్న అభిప్రాయంతో ఉన్నట్లు తెలిసింది.

నేతలతో టచ్‌లోకి..

చాలా రోజులుగా లూప్‌లైన్‌లో ఉంటూ లా అండ్ ఆర్డర్‌లో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న పలువురు పోలీస్ అధికారులు కాంగ్రెస్ పార్టీ నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. బీఆర్‌ఎస్ నేతలతో సత్సంబంధాలను కొనసాగించని అధికారులు దూర ప్రాంతాలలో లూప్‌లైన్‌లో పని చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల సహకారంతో వారు ఉమ్మడి మెదక్ జిల్లాకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో పనిచేసిన చోట్ల గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల వివరాలు సేకరిస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్న నేతల దగ్గరకు వెళ్లి పోస్టింగ్ ఇప్పించాలని కోరుతున్నారు. మరి కొందరు పోలీస్ అధికారులు మాత్రం తమకు నచ్చిన చోట పోస్టింగ్ ఇప్పించి నేతలు ఓడిపోవడం, ఆ పార్టీ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వం మారడంతో కొద్ది రోజుల్లోనే జిల్లాకు చెందిన అధికారులు బదిలీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జిల్లాల్లో అధిక డిమాండ్‌గల చోటు..

జిల్లాలో తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, రామాయంపేట, చిన్నశంకరంపేట, శివ్వంపేట, నర్సాపూర్, పోలీస్‌స్టేషన్లకు చాలా డిమాండ్ ఉంది. అక్కడ పోస్టింగ్‌ల కోసం ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలు రాజకీయ నాయకులకు ముడుపులు సమర్పించుకుని బదిలీ చేయించుకుంటారనేది జగమెరిగిన సత్యం. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం.

ప్రజావాణి పునః ప్రారంభం

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని, ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

డీఈఓ రాధాకిషన్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు డీఈఓ రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 847 మంది హాజరు కావాల్సి ఉండగా 826 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారితోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లుగా ఏఎంఓ సుదర్శనమూర్తి, నర్సాపూర్ ఎంఈఓ బుచ్చనాయక్‌ను నియమించామని వారు మెదక్, తూప్రాన్, నర్సాపూర్ పరీక్ష కేంద్రాలను సందర్శించి పరిశీలించారని వివరించారు.

రసాభాసగా ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరణ

నర్సాపూర్: ఆదివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం రసాభాసగా మారింది. అధికారులు నిర్వహించిన ఈ కార్యక్రమానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, తాత్కాలిక డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి అక్కడికి చేరి అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని, తనను పిలువకుండానే కార్యక్రమం చేపట్టారని నిలదీశారు. శనివారం జరిగిన మహాలక్ష్మి ఫ్రీ బస్ పథకం ఆవిష్కరణ సమయంలో కూడా ఇలాగే చేశారని ధ్వజమెత్తారు. పార్టీ నాయకులను వేదిక నుంచి పంపాలని ఆమె అధికారులకు సూచించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ జోక్యం చేసుకుని కాంగ్రెస్ నాయకులను వేదిక నుంచి వెళ్లాలని కోరగా తనను పిలిచి అవమానించడం సరికాదని ఆవుల రాజిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ నేత ఆవుల రాజిరెడ్డి తమ కార్యకర్తలకు నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తుండగా అంతా గందరగోళంగా తయారైంది. కొంత సేపటికి ఎమ్మెల్యే సునీతారెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. సునీతారెడ్డి మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పోస్టర్లు ఆవిష్కరించేందుకు ఆసుపత్రికి వచ్చే సరికి కాంగ్రెస్ నాయకులు అక్కడే ఉండడంతో ఆమె పోస్టర్లు తీసుకురావాలని అధికారులకు చెప్పారు. అధికారులు పోస్టర్లు తీసుకురాగానే ఆసుపత్రి మెయిన్‌గేటు వద్ద పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సునీతారెడ్డి ఆవిష్కరించారు. జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్, డీఎంహెచ్ఓ డాక్టర్ చందులాల్ తదితరులు రెండు పార్టీల నాయకులకు నచ్చ చెప్పేందుకు ప్రయత్నించినా వారు వినిపించుకోకుండా ఎవరి వాదనలు వారు కొనసాగించారు.



పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నేతల వాగ్వాదం

అగౌరవపరిచే విధంగా వ్యవహరిస్తున్నారు: ఎమ్మెల్యే సునీతారెడ్డి

అధికార కార్యక్రమమైన శనివారం జరిగిన మహాలక్ష్మి పథకం ప్రారంభోత్సవం సమాచారం తనకు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్ తదితరులు చేపట్టి తనను అగౌరవపరిచారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడం విచారకరమన్నారు. తనకు జరిగిన అవమానంపై అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆమె హెచ్చరించారు.

విజయవంతం చేసేందుకు వచ్చాం: ఆవుల రాజిరెడ్డి

రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తాము వచ్చామని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. తాము ప్రొటోకాల్ అధిగమించలేదని, అధికారులు పిలిస్తేనే వచ్చామన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి వెంట ఎలాంటి హోదా లేని బీఆర్‌ఎస్ నాయకులు, పలువురు మహిళ కౌన్సిలర్ల భర్తలు కార్యక్రమానికి ఎలా వచ్చారని ప్రశ్నించారు. తనను పిలిచి వెళ్లిపోమనడం ఆక్షేపణీయమన్నారు. ఆయన అధికారుల తీరును తీవ్రంగా ఖండించారు.

ఎస్టీ మహిళను.. అందుకే అవమానం

ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి నాయక్



జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్‌ను నిలదీస్తున్న కాంగ్రెస్ నేతలు

నర్సాపూర్: ఎస్టీ మహిళను కాబట్టే తనను రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పోస్టర్ల ఆవిష్కరణకు పిలవకుండా ఎమ్మెల్యే సునీతారెడ్డి, అధికారులు అవమానించారని ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి నాయక్ ఆరోపించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి తనను ఆహ్వానించకపోవడం సరికాదన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి అహంకార ధోరణితోనే ఎస్టీ ప్రజాప్రతినిధిని పిలువలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అదనపు కలెక్టర్‌తో నేతల వాగ్వాదం

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పోస్టర్ల ఆవిష్కరణకు ఎంపీపీని పిలువ లేదని జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్, డీఎంహెచ్ఓ డాక్టర్ చందులాల్, ఇతర అధికారులను ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతితో పాటు పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, పార్టీ నాయకులు ఆంజనేయులుగౌడ్, కరుణాకర్‌రెడ్డి తదితరులు ప్రభుత్వ ఆస్పత్రి గేటు బయట నిలదీశారు. ఈ ఘటనపై కేసులు నమోదు చేయించాలని నిలదీశారు.

ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచడం సంతోషం

ఎమ్మెల్యే సునీతారెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్, ఆర్‌డీఓ తదితరులు

నర్సాపూర్: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఐదు లక్షల నుంచి పది లక్షల రూపాయలకు పెంచడం సంతోషమని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆ పథకం పోస్టర్లను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆదివారం ఆమె పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని కొనసాగించిందని, అది పేదల పాలిట వరం లాంటిదని కొనియాడుతూ ప్రస్తుత ప్రభుత్వం పథకాన్ని ఐదు లక్షల నుంచి పది లక్షల రూపాయలకు పెంచడం సంతోషమని చెప్పారు. పథకానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పథకాల అమలుకు తాను ఒక ఎమ్మెల్యేగా సహకరిస్తానని, ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొంటూ పేదలకు సేవ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. శనివారం పలువురు కాంగ్రెస్ నాయకులు ఫ్రీ బస్ ప్రయాణం కార్యక్రమం ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ విస్మరించి తనను అగౌరవపరిచారని ఆమె విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్, డీఎంహెచ్ఓ డాక్టర్ చందులాల్, డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్, ఆర్‌డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాద్రి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీటీసీ బబియానాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్వసభ్య సమావేశానికి హాజరవుతా

పొన్నంను కలిసిన మున్సిపల్ కమిషనర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రాజశేఖర్

హుస్నాబాద్: హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం రాత్రి మున్సిపల్ కమిషనర్ ఎం.ఆర్ రాజశేఖర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. త్వరలోనే జరిగే మున్సిపల్ పాలకవర్గ సర్వసభ్య సమావేశానికి హాజరవుతానని మంత్రి చెప్పినట్లు కమిషనర్ వెల్లడించారు.

దామోదరకు సన్మానం



దామోదరను సన్మానిస్తున్న పాండు

మునిపల్లి(అందోల్): వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహను ఎంపీటీసీల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుర్కల పాండు కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాకప్పి సన్మానించారు.

వన భోజనాలతో ఐక్యత

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



కార్యక్రమంలో చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్: వన భోజనాలతో ప్రజల్లో ఐక్యత, స్నేహభావం పెరుగుతుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం మంజీరా డ్యామ్ శివాలయ ఆవరణంలో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో వన భోజనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చింతా ప్రభాకర్ హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ఏకగ్రీవ తీర్మానం చేస్తూ నాకు మద్దతు ఇచ్చిన వీరశైవ లింగాయతీల అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ భవన నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్ప, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్ పటేల్, శివ కుమార్, రాజు, ధనుంజయ్, రాజేశ్వర్ స్వామి, సీడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, చక్రపాణి, వీరశైవ లింగాయత్ సభ్యులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై..

నిజాంపేట(మెదక్): నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి వ్యక్తి ఆదివారం చెరువులో శవమై తేలాడు. ఈ ఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కుమ్మరి శ్యామ వ్వ, బుచ్చయ్యల కుమారుడు కుమ్మరి రాజు (30) మతిస్థిమితం సరిగా లేక నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కలా వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం ఘడీం చెరువులో మృతదేహం తేలడంతో గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చలికాలం.. జీవాలు పైలం

- జాగ్రత్తలు తీసుకోకపోతే తీరని నష్టం
- పోషకులు సూచనలు తప్పకుండా పాటించాలి
- పశువైద్యాధికారి డాక్టర్ మంజుల



పచ్చిక మేస్తున్న జీవాలు

మానవ మనుగడకు ప్రకృతి సంపదతోపాటు పశుసంపద కూడా చాలా ముఖ్యం. ప్రత్యక్షంగా, పరోక్షంగా మానవ సమాజానికి పశుసంపద ఎన్నో విధాలుగా మేలు చేస్తున్నది. కాలానికి అనుగుణంగా ఆరోగ్యంపై మనుషులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో పశువులకు కూడా అలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. చలికాలంలో పశువుల వ్యాధుల బారిన పడకుండా పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)

రోజు రోజుకూ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గొర్రెలు, మేకల్లో దొమ్మ, జలుబు వ్యాధుల ముప్పు పొంచి ఉంది. పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని చిన్నకోడూరు పశువైద్యురాలు డాక్టర్ మంజుల తెలిపారు. చలికాలంలో జీవాలు నిమ్ము, జలుబు, దగ్గు వ్యాధులు వస్తే ఎలాంటి నియమ నిబంధనలు పాటించాలో ఆమె మాటల్లోనే..

దొమ్మ రోగం..

- దొమ్మ రోగం వ్యాప్తికి పలు రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌లు, పరాన్న జీవులు కారణం. కంటేజీఎస్ కాప్రైన్ ప్లూరో నిమోనియా అనే వైరస్ కారణంగా మేకలకు మాత్రమే తరుచుగా వచ్చే వ్యాధి. ఈ వ్యాధి సోకిన జీవాలకు జ్వరం తీవ్రంగా ఉంటుంది.
- వేగంగా శ్వాస పీల్చుకోవడం, ఎగశ్వాస, ముక్కు నుంచి నీరు, చీమిడి కారడం, ఆకలి లేకపోవడం రోజు రోజుకూ నీరసించి పోతాయి.
- కళ్లు ఎర్రబడి నీరు కారడం, వీపు భాగం వంగి ఉండటం, తల, మెడ ముందుకు సాగినట్లు కనిపిస్తాయి. అంతేకాకుండా ముక్కు రంధ్రాలు వెడల్పుగా అవుతాయి.



డాక్టర్ మంజుల, పశువైద్యాధికారి

- త్వరగా చికిత్స చేయించకపోతే ఊపిరితిత్తులు వాచి వాటికి చీము పట్టే ప్రమాదముంది. అయితే ఈ లక్షణాలు కనిపిస్తే దొమ్మ రోగంగా నిర్ధారణకు రాకూడదు.
- ఈ లక్షణాలు అమ్మతల్లి, వీవీ ఆర్ మొదలైన జబ్బుల్లో కూడా కనిపిస్తాయి. ఎప్పటికప్పుడూ టీకాలు వేయించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన నీటిని అందించాలి.

జలుబు, దగ్గు..

- ఈ వ్యాధి సోకినప్పుడు పశువులకు తుమ్ములు, కళ్లు, ముక్కు నుంచి నీరు కారడం, చీమిడి పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- పశువుల పాక ఇరుకుగా ఉండడం, గాలి వెలుతురు సరిగా లేకపోవడం, పాకల్లో తేమ, తడి ఎక్కువగా ఉండటం కాలుష్యం, దుమ్ము వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చే మార్పులు ఈ జబ్బుకు కారణమవుతుంటాయి.
- అలాగే క్రిముల ద్వారా సోకే అంటు వ్యాధులతోపాటు బయట నుంచి ఆహారం ద్వారా శ్వాసకోశంలోకి వచ్చే కణాలు, నూనె పదార్థం శ్వాసకోశాన్ని చికాకు పెట్టే ఇతర పదార్థాలు కూడా జలుబు, దగ్గుకు కారణమవుతాయి.
- దీని నివారణకు పాకలోకి గాలి, వెలుతురు వచ్చేలా చూడాలి. వాతావరణం సరిగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకను శుభ్రంగా ఉంచాలి. జబ్బు సోకినప్పుడు పశువైద్యాధికారులను సంప్రదించాలి.
- ఒక వేళ జీవి చనిపోతే పోస్టుమార్టం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి మందలోని మిగిలిన జీవులకు చికిత్స చేయించాలి. ఈ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా దొమ్మ టీకా వేయించాలి.

గ్రూపు విభేదాలే కారణమా?

- దుబ్బాకలో కాంగ్రెస్ ఓటమిపై అధిష్టానం ఆరా..
- గెలుస్తుందనుకున్న దగ్గర ఎందుకు ఓడింది
- డిపాజిట్ కూడా దక్కకపోవడం ఆశ్చర్యం
- 25,235 ఓట్లతో 3వ స్థానానికి పరిమితం





చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగి అధికారంలోకి వస్తే.. దుబ్బాక నియోజక వర్గంలో మాత్రం పార్టీ ఘోరపరాజయం చవిచూసింది. మొదటి నుంచి గ్రూపు విభేదాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న దుబ్బాకలో ఈసారి కచ్చితంగా కాంగ్రెస్ జెండా ఎగురుతుందని భావించిన అధిష్టానానికి నిరాశే మిగిలింది. గెలుపు కాదు కదా కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. ఓటమికి నేతల మధ్య నెలకొన్న గ్రూపు విభేదాలే కారణమా ఇంకా ఏమైనా ఉన్నాయా అన్న దానిపై పార్టీ అధిష్టానం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు విశ్వసనీయ సమాచారం.

టికెట్ దక్కకపోవడంతో..

మొదటి నుంచి దుబ్బాక కాంగ్రెస్‌లో గ్రూపు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో గ్రూపు విభేదాలు నెలకొనడంతో ఎన్నిసార్లు అధిష్టానం సమన్వయం కోసం ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. ఎన్నికల ముందు దుబ్బాక టికెట్ కోసం మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పన్యాల శ్రావణ్ కుమార్ రెడ్డి, కత్తి కార్తీక తీవ్ర స్థాయిలో పోటీ పడ్డారు. ఆఖరికి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికే టికెట్ దక్కింది. దీంతో కత్తి కార్తీక ఎన్నికలకు నాలుగురోజుల ముందు బీఆర్ఎస్ చేరి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఇక టికెట్ రాకపోవడంతో శ్రావణ్ కుమార్‌రెడ్డి దుబ్బాక వైపే చూడకపోవడం తన అనుచరులు సైతం శ్రీనివాస్‌రెడ్డికి ఎన్నికల్లో సహకరించకపోవడం కనిపించింది.

డిపాజిట్ దక్కని పరిస్థితి..

దుబ్బాకలో ఈసారి కాంగ్రెస్ జెండా ఎగురతుందని అధిష్టానం ధీమాగా ఉండగా నియోజకవర్గంలో సైతం శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ కేటాయిస్తే తప్పకుండా గెలుస్తాడని సర్వేల్లో తేలింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ త్రిముఖ పోటీలో ఎవరు గెలుస్తారో ఓ దశలో అంతు చిక్కని పరిస్థితి కనబడింది. తీరా ఎన్నికల ఫలితాలు వెలువడడంతో కాంగ్రెస్‌కు కనీసం డిపాజిట్ కూడా దక్కకపోవడం శోచనీయం. చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి కేవలం 25,235 ఓట్లు మాత్రమే వచ్చాయి. డిపాజిట్ కు కావాల్సిన 28,894 ఓట్లకు 3,500 పై చిలుకు ఓట్లు దూరంగా ఉండడం ఆశ్చర్యం కలిగించింది. దుబ్బాకలో ఓటమిపై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

కనీస వేతనం అమలు చేయాలి

- మెడ్వన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి
- అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

సంగారెడ్డి: గృహ కార్మికులకు న్యాయం చేయాలని మెడ్వన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మెడ్వన్ కార్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. అలాగే, మెడ్వన్ స్వచ్ఛంద సంస్థ ఆధర్యంలో మౌంట్ ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ వారి సహకారంతో గృహ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లాయర్ విఠల్ రెడ్డి, మెడ్వన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి హాజరై మాట్లాడారు. మానవ హక్కులని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలతోపాటు సమాజం పైన ఉందన్నారు. ప్రైవేట్ సంస్థల్లో, గృహాల్లో పని చేసే కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ వెంకటేశ్, స్వప్న, సమీర్, గృహ కార్మికులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పథకం సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యాదవరెడ్డి

గజ్వేల్: గజ్వేల్ ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ప్రారంభించారు. పథకం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఆర్ఎంవో డాక్టర్ రాము, వైద్యులు రాజేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.


చరిత్రకు చెదలు

- శిథిలావస్థలో గడీ కోటలు
- కనుమరుగవుతున్న గత అనవాళ్లు
- మెదక్ జిల్లా వ్యాప్తంగా 250కి పైగానే..
- పట్టించుకోని అధికారులు

రామాయంపేట(మెదక్): చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న గడీ కోటలు శిథిలమవుతున్నాయి. వీటి మరమ్మతు విషయమై ప్రభుత్వాలు ఎంతమాత్రం పట్టించుకోకపోవడంతో గత వైభవం చాటిచెప్పిన గడీ కోటలు రానురాను కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. జిల్లా పరిధిలోని 469 పంచాయతీల్లో సుమారుగా 268 వరకు గడికోటలు ఉండగా, 250కి పైగా పాక్షికంగా శిథిలమైనట్లు గతేడాది పురావస్తుశాఖ అధికారుల సర్వేలో తేలింది. వీటిలో చాలా వరకు వందేళ్లక్రితం నిర్మించినవే. అప్పటి పాలకులు తమ శత్రువుల రాకను దూరం నుంచే తెలుసుకొని వారిని ఎదుర్కోవడానికి వీలుగా గ్రామానికి ఎత్తయిన ప్రదేశంలో ఈ కోటలు నిర్మించినట్లు పెద్దలు చెబుతుంటారు. శత్రువులు నేరుగా గ్రామాల్లోకి రాకుండా నిలువరించడానికి ఈ గడులను ఉపయోగించేవారని తెలిసింది. కానీ, ప్రస్తుతం వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆయా గ్రామాల్లో ఉన్న కోటలు రోజురోజుకూ శిథిలమై కూలిపోతున్నాయి. గ్రామాల్లో ఒక్కో గడీది ఒక్కో చరిత్రగా చెబుతుంటారు. అలాంటివి నేడు కరుమరుగయ్యే పరిస్థితిలో ఉండడం ఆందోళన కలిగిస్తుంది.

గడీ నిర్మించిన తర్వాతే తండా ఏర్పాటు

అటవీ ప్రాంతంలో ఉన్న మండలంలోని సదాశివనగర్ తండాలో సుమారు 150 ఏళ్ల క్రితం ఓ గడీ నిర్మించారు. దాని తర్వాతే అక్కడ తండా వెలిసినట్లు వృద్ధులు చెబుతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో నిర్మించిన ఈ గడీ వద్దకు అప్పటి రాజులు వేట కోసం వచ్చినప్పుడు విడిది చేసే వారని గిరిజనులు తెలిపారు. నేడు ఈ గడికోట పూర్తిగా శిథిలమైంది. ఝాన్సీలింగాపూర్ గ్రామంలో గడీకి పెద్ద చరిత్రే ఉంది. అప్పటి పాలకులకు సంబంధించి వంశంలో కొందరు ఇప్పటికీ గ్రామానికి వచ్చి వెళ్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ గడీ, స్థలాన్ని పంచాతీవారు పర్యవేక్షిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో గతంలో నిర్మించిన గడీలు రహదారికి అడ్డుగా ఉన్నాయి. పాక్షికంగా శిథిలమైన కూలిపోతున్నాయి. నిజాంపేట, కాట్రియాల గ్రామాల్లో రోడ్డును ఆనుకొని ఉన్న గడీలు ప్రమాదకరంగా మారాయి.



సదాశివనగర్‌తండాలో పూర్తిగా శిథిలమైన గడీ

ఒక్కో గడీది ఒక్కో చరిత్ర



నేడు జిల్లా వ్యాప్తంగా ఉన్న గడీలు చాలా వరకు శిథిలమై కూలే పరిస్థితికి చేరుకున్నాయి. గత వైభవాన్ని, చరిత్రను చాటి చెబుతున్న గడీలను పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించాల్సిన అవసరం ఉంది. గత చరిత్ర అందరికీ తెలియాలంటే వీటిని మరమ్మతు చేయించి, గ్రామాల వారీగా గడీల వివరాలు సేకరించాలి.

– కిషన్, కోనాపూర్

రాజుల విడిది



సదాశివనగర్‌లో పూర్తిగా శిథిలమైన గడీకి ఎంతో చరిత్ర ఉంది. ఇక్కడ తండా ఏర్పాటు కాకముందే గడీ ఉన్నట్లు అప్పటి పెద్దలు చెప్పారు. అప్పటి రాజులు వేటకు వెళ్లి రాత్రివేళ ఈ గడీలో విశ్రమించేవారట. తద్వారా ఇక్కడ తండా ఆవిర్భవించింది.

– రాంసింగ్, సదాశివనగర్ తండా, రామాయంపేట

నాచగిరికి పోటెత్తిన జనం



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు



నాచగిరిలో కొలువుదీరిన స్వామివారు

వర్గల్(గజ్వేల్): ఓ వైపు కార్తీక వ్రతాలు, మరోవైపు నిజాభిషేకాలు, కల్యాణాలతో ప్రసిద్ధ నాచగిరి పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మికతలు వెల్లివిరిశాయి. కార్తీకమాసం చివరి ఆదివారం సెలవురోజు కావడంతో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, ఇరుగు పొరుగు జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. వ్రతమండపం, క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోగా, ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులు ఉదయమే క్షేత్రం చేరుకొని హరిద్రలో పుణ్యస్నానాల అనంతరం గర్భగుడిలో శ్రీవారి దర్శనం చేసుకున్నారు. మరోవైపు దంపతులు భక్తి శ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం చేసుకున్నారు. క్షేత్రంలో 200 సత్యదేవుని వ్రతాలు, 20 సేవలు, 9 నిజాభిషేకాలు, 13 కల్యాణాలు జరిగాయి. మరోవైపు సత్యనారాయణస్వామి ఆలయ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో సుధాకర్‌గౌడ్, నరేందర్, పాండు తదితర సిబ్బంది భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ఉచిత బస్సు ప్రయాణం గొప్ప పరిణామం

ప్రగతి వేదిక రాష్ట్ర కన్వీనర్ రాంచంద్రారెడ్డి



స్వీట్లు పంచుతున్న రాంచంద్రారెడ్డి

దుబ్బాకటౌన్: సీఎం రేవంత్‌రెడ్డి స్త్రీల ఆకాంక్షలను నెరవేర్చడం గొప్ప పరిణామం అని తెలంగాణ ప్రగతి వేదిక రాష్ట్ర కన్వీనర్ అమ్మిన రాంచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ప్రగతి వేదిక ఆధ్వర్యంలో దుబ్బాక బస్టాండ్ వద్ద మహిళలకు స్వీట్లు పంచి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఆర్థికంగా భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్ సౌకర్యం చాలా మంచి నిర్ణయమన్నారు. మహిళలు ఆర్థికంగా మరింత పురోగతి, చైతన్యం సాధించేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,300 బస్‌లలో మహిళలు ఉచిత ప్రయాణం చేయొచ్చన్నారు. ఏడాదికి రూ.3 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతున్నా మహిళా సాధికారితను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకోవడంపై సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వేదిక నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాల్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

మా ఊరికి బస్సే లేదు..

- ఆర్టీసీ బస్సుల కోసం పల్లెలు ఎదురుచూపు
- అక్కన్నపేట మండలంలో దయనీయ పరిస్థితి
- పక్కా రోడ్లు ఉన్నా వృథానే..



పంతుల్‌తండా గ్రామానికి వెళ్లే రోడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): పల్లెల శాపమో...అధికారుల కోపమో.. కానీ నేటికీ అనేక గ్రామాలు పల్లె వెలుగు బస్సులను ఎరుగవు. గ్రామాల్లో ఉండే ప్రజలు నిత్యం తమ అవసరాల కోసం సమీప పట్టణాలు, మండల, నియోజకవర్గ కేంద్రాలకు వెళ్లాలంటే ఎక్కువగా ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తారు. కానీ, బస్సులు రాకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు.

అక్కన్నపేట మండలంలో 32 గ్రామాలు ఉంటాయి. అందులో కేశవాపూర్, మంచినీళ్ల బండ, దుబ్బతండా, గుబ్బడి, కపూర్ నాయక్, పంతుల్ తండా, జనగామ, కేశనాయక్ తండా, మైసమ్మవాగు తండాకు నేటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. ఈ గ్రామాల్లో పక్కా రోడ్లు ఉన్నా బస్సులు మాత్రం వెళ్లడం లేకపోవడం గమన్హారం. కేశవాపూర్ నుంచి మంచినీళ్ల బండ వైపుగా టేకుల తండా మీదుగా కొత్తకుండ వరకు పక్కా రోడ్డు ఉంది. అలాగే అక్కన్నపేట మండల కేంద్రం నుంచి నేరుగా పంతుల్‌తండా వరకు రోడ్డు సౌకర్యం ఉంది. కపూర్ నాయక్ తండా, కేశనాయక్ తండా గ్రామాలకు రోడ్లు ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు తిరగడం లేదు. దీంతో మండల కేంద్రానికి, పక్క గ్రామాలకు అవసరాల నిమిత్తం ప్రజలు, విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామాల పరిస్థితిని ప్రజాప్రతినిధులు, నాయకులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించినా మాకు ఎలాంటి ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఈ గ్రామాల వైపు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అయితే హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత రవాణశాఖ మంత్రిగా పొన్నం పదవి బాధ్యతలు చేపట్టడంతో ఈ గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సౌకర్యం వస్తుందని జోరుగా చర్చించుకుంటున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని చక్రపురి కాలనీలో రఘువర్మకు చెందిన ఖాళీ స్థలంలో ఓ గుర్తు తెలియని మృతదేహం కనిపించిందని శనివారం రాత్రి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. భార్య ఇంటికి రావడం లేదని మనోహరాబాద్‌లో ఓ వ్యక్తి ఉరి వేసుకోగా, కుటుంబ కలహాలతో చిన్నశంకరంపేటలో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీవితంపై విరక్తితో నిజాంపేటలో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు.

భార్య రావడం లేదని..



దుశ్యంత్ కుమార్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): భార్యపై మనస్తాపంతో భర్త ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రం జార్సుగుండా జిల్లాకు చెందిన దుశ్యంత కుమార్ జెన (42) మనోహరాబాద్ మండలం కాళ్ళకల్ గ్రామంలో అద్దెకుంటున్నాడు. ముప్పిరెడ్డి పల్లి శివారులో గల వీఎస్టీ పరిశ్రమలో రెండేళ్లుగా కార్మికుడిగా పని చేస్తూ భార్యాపిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల క్రితం భార్య పిల్లలతో కలిసి సొంత గ్రామానికి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన భర్త ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఎస్ఐని వివరణ కోరగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు

చిన్నశంకరంపేట(మెదక్): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చిన్నశంకరంపేట మండలం మీర్జా పల్లి–వడియారం రైల్వేస్టేషన్ మధ్యలోని కామారం శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌కు చెందిన కొమ్ము జీవన్ అలియాస్ రాజు (28) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో కామారం శివారులో ఎదురుగా వస్తున్న రైలును ఢీకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కామారెడ్డి రైల్వే పోలీసులు తెలిపారు.



జీవన్ (ఫైల్)

జీవితంపై విరక్తితో..

నిజాంపేట(మెదక్): జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని బచ్చురాజు పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చెందిన కమ్మరి నర్సింలు(45) మద్యానికి బానిసై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.